# కరిమింగిన వెలగపండు

నీరు ఒక పెద్ద నిజం. నింగి ఇంకో పెద్ద నిజం – అన్పించింది. ఆ సాయం కాలం యారాడ కొండంచున నిలుచుని నా పాదాల దిగువ పరచుకుని వున్న సువిశాలమైన నీలి రంగు సముద్రపు ఉపరితలం చూసినప్పుడు--

తల పైకెత్తి ఆకాశమనే ఆ వింత గొడుగును చూసినప్పుడు ఎందుకోమరి, నిండుగా తృప్తిగా అన్పించింది. అది తృప్తేనా, లేక ఆనందమా? అయితే ఎందుకు? మనుషులకు, చప్పుళ్ళకు, మాటలకు దూరంగా వచ్చినందుకా? భూమికి మూడువందల అడుగుల ఎత్తున స్వచ్ఛమైన గాలిని పీలుస్తున్నందుకా? ఏకాంతంగా అనంతంలో ఒక భాగమై యోగంలోకి జారినందుకా?

-- ఇదేమీ కాదు, ఈ భూమ్మీదా నాలోనూ పదింట ఏడు వంతులు నీరైనందుకా....

నవ్వొచ్చింది. ఆ కింద, ఇసుక తీరాన్ని తాకుతున్న అలల అలజడిలా, ఈ కారణం వెతికే గుణం నాకు రానేల? నిశ్చలంగా ఆ నడిసంద్రంలోవున్న నిండు సంద్రంలో వున్న నిండు దనాన్ని అలా వుండనివ్వక ఆలోచనల ఒడ్డుకు లాక్కొచ్చి ఒకటిని పెక్కు ముక్కలుచేసి ఇసుకలోకి విసిరేయనేల?

– కారణం వెతక్కపోతే సైన్సులేదు. ముక్కలు తీయకపోతే హేతువు తెలియదు. మరి వాటివెంట పడగానే మనిషి కోల్పోతున్న ఆ ఇదమిత్థమని తెలియని కేంద్రం ఎక్కడ వున్నట్లు?

-- ఎవరో నవ్వారు తిరిగి చూశాను. కనకదుర్గ గుడినించి కాబోలు. పూజ చేయించి వస్తున్నట్లున్నారు. యువ దంపతులు. గలగమని నవ్వుతున్నారు. కొబ్బరి చిప్పను కొరుక్కు తింటున్నారు. మెట్లు దిగుతూ, మధ్యనాగి ఆ అబ్బాయి, అమ్మాయి భుజం మీద చేయివేసి దగ్గరకు తీసుకుని చూపిస్తున్నాడు. "అదుగో అదే కన్వేయర్ బెల్ట్ అంటారు. అది ఇనుమును తెచ్చి అదిగో అక్కడ ఓర్ బెర్త్ దగ్గర షిప్పులు నిలబడతాయి, వాటిలోకి గంటకు ఎనిమిది వేల టన్నుల చొప్పున పోస్తాయి.

ఇలాటి హార్బర్ మనదేశంలో లేదు తెలుసా?" అని అదంతా తనే ప్లానువేసి తన చేతులతోనే కట్టినట్లు సగర్వంగా చెబుతున్నాడు. బహుశ రేవులో పని చేస్తున్నాడు కాబోలు. అతనంత శ్రద్ధగా సవివరంగా చెబుతున్నా ఏమీ విన్పించుకుంటున్నట్టులేదు ఆ అమ్మాయి. అతనికి దగ్గరగా ఉండడంలో, అతని మాటలు వినడంలో ఆమెకు ఆనందం కాబోలు.

వాళ్ళిద్దరూ మెట్లు దిగసాగారు. అటు చూశాను. చిన్న కొండకు గుండ్రటి తెల్లటి టోపీ తొడిగినట్టు దర్గా వుంది. ఔరంగ జేబు తర్వాత నవాబుల హయాములో కట్టారట దాన్ని. అపక్కనే ఎత్తుగా గోపురంతో మరో కొండపై నిలబడివుంది ఏడు కొండలవాడి ఆలయం. ఆవెనుక అన్నిటికన్న ఎత్తుగావున్న కొండపై కోటలావున్న కన్నెమరియమ్మ చర్చి. అటు మూడు కొండలపై మూడు ఆలయాలు, ఇటు నా వెనుక సాగరగిరి కనక దుర్గ – ఆలయం. యువతి యవ్వనం వంటి ఈ రెండు – కొండల గుంపుల మధ్య పొడుగాటి జడలా ఎంట్రన్స్ ఛానల్ అనబడే నీటి దారి. అదారి చివర అటు పడమటి వైపు విశాఖ రేవు, షిప్ యార్డ్, అనీటి దారికి తూర్పు చివర 'బంగాళాఖాతం' అని మనిషి పిలిచే సముద్రం–

చటుక్కున నాకంట బడింది సీగల్. రయ్ మని ఆ రెండువందల అడుగుల నుండి సముద్రంమీదకు దిగి, అలల అంచును ముక్కుతో పొడిచి, మరు క్షణం లేచి పైకి రివ్వున లేచింది. దాని ముక్కు చివర బహుశ ఏ చేపో వుండి... వుంటుంది. ఆ సీగల్ యొక్క వేగం, అలాఘవం, చూసి ఆశ్చర్యపడాలా లేక అందాకా, హాయిగా, ఈ నీరే ప్రపంచం అన్నట్లుగా మరో ఆలోచనలేకుండా బతికిన ఆ చేపను చూసి జాలిపడాలా? జరిగింది ఒకటే సంఘటన. దానికొక పక్క ఆహారం దొరికిన సంతృప్తి, ఇంకొకవైపు చచ్చిపోతున్న వేదనా. నా మనస్సు ఎటువైపు మొగ్గాలి? లేక తక్కెడ ఎటువాలినా నా త్రాసుముల్లు మాత్రం నిశ్చలంగా నిలబడాలా? ఆకలి, చావు రెండూ నిజమే కదా..... ఒకరి ఆకలిని ఇంకొకరి చావు తీర్చినప్పుడు ఏది న్యాయం, ఏది అన్యాయం! మనం ఎటు నిలబడితే అది న్యాయమయితే– అన్నిటికి మించిన చెక్కుచెదరని న్యాయం అనేది ఒకటి వుంటుందా? ఉండగలదా? లేక అంతా ఈ relativity యేనా?

"బోంయ్! బోంయ్!" మని గర్జన వినబడింది. అలవాటు లేని వారికయితే అది ఏ పాతకాలపు జంతువు అరుపో అన్పిస్తుంది.

కింద ఛానల్‌లో టగ్ 'సిరి' ఒక ఓడను లాక్కొస్తోంది. నాకే వూరొచ్చి చూసేదాక రేవుల్లోకి ఓడలు తమంతట తాముగా రావనీ, వాటిని 'టగ్' లనబడే ఈ చిన్న ఓడల్లాటివి లాక్కు వెళతాయనీ తెలియదు. ఈ టగ్‌లకు, లాంచీలకు పేర్లు ఎవరు పెడతారు. ఆ ఓడను ముక్కుతో వేసి లాక్కొస్తున్న టగ్గుపేరు 'సిరి', ఓడ పక్కగా ఇంకో టగ్గుంది. దానిపేరు 'నాగార్జున' అని కనబడుతోంది.

ముందు వెనకల, ఇరుపక్కలతోడై – అన్న త్యాగరాజ కృతిలో వలె ఇటూ అటూ టగ్గులతో రాయంచలా మంద గమనంతో, రెండు కొండల మధ్య ఛానెల్‌లో నిండుగా ఓ ఓడ సాగి పోతుంటే కనుల పండుగగా వుంది.

అరె!

ఇది-- "సూర్యతేజ"!...అయితే ఈ కొత్త ఓడకిది మొట్ట మొదటి సాగరయానమన్నమాట...

"సూర్యతేజ"కు మాస్టర్, కెప్టెన్ చౌహాన్ అయి వుంటాడు! అదిగో ఛానెల్ దాటి ఔటర్ హార్బర్‌లోకి ప్రవేశిస్తూంది "సూర్యతేజ." ఆ బ్రిడ్జిమీద పోర్టు పైలట్ పక్కనే ఉంటాడు కాబోలు చౌహాన్.

ధీరేంద్రనాథ్ చౌహాన్!

కెప్టెన్ డి. ఎన్.చౌహాన్....నాజూగ్గా, తెల్లగా పొడుగ్గా వుంటాడు. యూనిఫారంలో కన్నా మామూలు దుస్తుల్లో ఇంకా అందంగా వుంటాడు. ముప్ఫై ఏళ్ళయినా నిండలేదు.

అతడిని నెలరోజులకు ముందు నాకు తెలియదు. ఈనాడు నేనతడిని మరచిపోలేను.

* * *

నెలరోజుల ముందు నేను ఆ శనివారం సాయంకాలం మామూలుగా ఆఫీసర్స్ క్లబ్ కు వెళ్ళాను. రేవులో ట్రాఫిక్ మేనేజర్ శశిధర్ అప్పటికే వచ్చి టెన్నిస్ బంతిని గోడకేసి కొట్టి ఆడుతున్నాడు. ఆరు నూరయినా నూరు ఆరయినా శశిధర్ మాత్రం సాయంకాలం అయిదయ్యే సరికి టెన్నిస్ కోర్టులో వుండవలసిందే.... ఎవరూ రాకపోతే గోడను పార్ట్నర్‌గా చేసుకుని ఆడుతుంటాడు.

నాలుగు సెట్లు ఆడేసరికి చాలనిపించింది. ఇద్దరం కేన్ చేర్లలో జారగిల పడ్డాం. తువ్వాళ్ళతో మొహాలు తుడుచుకుంటున్నాము. క్లబ్ కుర్రాడు కూల్ డ్రింక్స్ తెచ్చిపెట్టాడు. అది తాగుతూ టీ పాయ్ మీదవున్న సినిమా పత్రిక అందుకున్నాను, తిరగేస్తున్నాను.

ఒక పేజీలో తాటికాయలంత అక్షరాలతో కనబడిందొక శీర్షిక. "కబీర్, పర్వీన్‌లు విడిపోతారా?..." "కత్తిరించిన గడ్డంతో కబీర్ బేడి ఫోటో అటు, కామధేనువులా పర్వీన్ బాబి ఫోటో ఇటు - మధ్య అసలు కథ, వున్నాయి.

"చూశారా శశిధర్.... ఈ సినిమా వాళ్ళకు, జీవితాలు కూడా సినిమా కథల్లాగే అన్పిస్తాయి. కాబోలు-" అన్నాను.

శశిధర్ తన చేతిలోవున్న గ్లాసు కేసి ఒక క్షణం చూశాడు. మిగిలిన పానీయాన్ని గట గట తాగేసి గ్లాసుని కిందపెడుతూ "రావ్! నిజానికి జీవితం ఒక్కోసారి సినిమా కన్న చిత్రంగా వుంటుంది." అన్నాడు.

"ఉండొచ్చుకాని... వీళ్ళిట్టే కలిసిపోతారు. మరుక్షణం విడాకులంటారు. అంతమరీ వేళ్ళులేని బంధం ఏమిటంటా?"

"నిజమే....కానీ వేళ్ళులోతుగా పాతుకున్న కొద్దీ, బంధం సడలినప్పుడు గాయం చాలా లోతుగా అవుతుంది. తెలుసా?"

"శశిధర్ ...మీరేనా ఈ విషాద దేవదాస్ డైలాగులు పలుకుతున్నది?"

నవ్వాడాతడు. "రావ్! రేపుదయం ఎనిమిదింటికి షిప్ యార్డ్‌లో షిప్ -లాంచింగ్

వుంది. పోదాం వస్తారా?"

అతడు విషయాన్ని మార్చినట్లు గ్రహించాను.... "అలాగే... ఎక్కడ కలుద్దాం?"

"ఏడున్నరకు 'రెడీ'గా వుండండి నేను వచ్చి తీసుకెళ్తాను."

మరు రోజు ఆదివారం.

ఏడింటికెల్లా సిద్ధంగా వున్నాను.

ఏడూ ఇరవైకి నీలిరంగు 'టోయోటా' ఆగింది మా ఇంటి ముందు.

నేను కారెక్కి శశిధర్ పక్కన కూర్చున్నాను.

కారు చర్రున బీచిరోడ్ మీదుగా జారిపోసాగింది. ఆ డ్రైవ్ ఎంత హాయిగా వుందో.... తెలుగు దేశంలో ఇంత చక్కని మెరైన్ డ్రైవ్ వుందని చాలామందికి తెలియదే, అయ్యో, అనిపించింది. కోస్టల్ బేటరీ దాటాము.

ఈలోగా భరించరాని, చేపల కంపు వచ్చింది. ముక్కు మూసుకున్నాను. "అదిగో అక్కడ డ్రెడ్జర్ చూశారా...అక్కడ సముద్రాన్ని వెనక్కునెట్టి ఈవూరి జాగ్రఫీ మారుస్తున్నాం. అక్కడే వస్తుంది. ఫిషింగ్ హార్బర్ కాంప్లెక్స్" అన్నాడు శశిధర్.

కారు రేవు ప్రాంగణంలోకి ప్రవేశించింది.

'మెరైన్ ఫోర్మన్ జెట్టీ' అన్న బోర్డు దగ్గర ఆగింది.

ఇద్దరం దిగాము "మహతి" అన్న లాంచి సిద్ధంగా వుంది. ఆసిబ్బంది సెల్యూట్ కొడుతుండగా ఇద్దరమూ ఎక్కి కూచున్నాము. భవ బంధాలను వదిలించుకుంటున్న ఆత్మలా ఒడ్డుకు కట్టిన తాళ్ళన్నింటినీ విప్పాక, లాంచి బయలుదేరింది. 'ఇంతసేపు నీకాశ్రయం ఇచ్చానే! నన్నొదలి వెళ్ళి పోతున్నావా' అని తీరం కార్చిన కన్నీటిలా తరంగాలు కదలాడాయి.

నీటిమీద అలా వేగంగా వెళ్తూంటే మనసునేదో ఉల్లాసం ఆవహిస్తూంది. కాలేజీలో లెక్చరర్నయిన నాకు, ఎన్నిసార్లు లాంచి ఎక్కినా ఎప్పటి కప్పుడు ఆ కొత్తదనం, ఆవేగం, ఆ మొహానికి తగిలే చల్లటి బరువయిన గాలి.... కాళ్ళకింద నేలకు బదులు నీరు అవన్నీ కలిసి మనసుకు రెక్కలు తొడుగుతాయి.

ఆ మాటంటే శశిధర్ నవ్వాడు. "ఇలా తిరగటం డ్యూటీ అంతే బాబూ!"

అంటే ఎంతటి అనుభూతి అయినా దైనందినం అయ్యేసరికి, 'డ్యూటీ' అనే పేరు కింద కొచ్చేసరికి పాతబడి పోతుందన్న మాట.

లాంచి ఐదునిముషాల్లో టర్నింగ్ బేసిన్ దాటి షిప్‌యార్డ్ 'వెట్ బేసిన్' దగ్గర ఆగింది.

దిగి మెట్లెక్కాము. మళ్ళీ నేల!

వి.ఐ.పి.ల వరుసలో కూర్చున్నాము. తోరణాలతో, రంగు కాగితాల అలంకరణలతో, హడావిడిగా తిరిగే మనుష్యులతో, ఆఫీసర్లతో, కార్మికులతో పెళ్ళి పందిరిలా సందడిగా వుంది. ఆ ఎదుట స్లిప్-వే మీద కొత్త పెళ్ళి కూతురిలా సర్వాలంకార శోభితయై, తాను తన జీవితాంతం కాపురం చేయవలసిన సముద్రుడి కౌగిట్లోకి ఎప్పుడెప్పుడు

జారిపోదామా అని తహతహ లాడుతున్నట్లుగా నిలబడి వుంది-- "మృగనయన" అన్న ముచ్చటైన పేరున్న అనౌక.

ఏడు నలభైకి ప్రారంభం అయింది. తతంగం.

వి.ఐ.పి.లు నిచ్చెన మీదుగా వేదిక నెక్కారు.

ఇంగ్లీషులో స్పీచీలు--

సంస్కృతంలో మంత్రాలు--

తెలుగులో-- "అప్పన్నా తాడొదిలేసెయ్" లు..

గంట ఎనిమిది. శుభ ముహూర్తం! తిలకం దిద్దారు. కొబ్బరికాయ కొట్టారు. ఉన్నట్లుండి ఆ ఇరవై వేల టన్నుల ఓడా కదులుతున్నట్లన్పించింది.

నెమ్మదిగా కదలింది.

వేగంగా సాగింది.

సర్రున వెళ్ళి, ఛళ్ మని నీళ్ళలోకి గెంతింది. దానికి స్వాగతం చెబుతూ రేవులోని ఓడలన్ని సైరన్లు మోగిస్తుంటే వేద ఘోషలా ప్రతిధ్వనించింది.

అది అవతలి ఒడ్డుకు వెళ్ళి కొట్టుకోకుండా పగ్గాలేసి పట్టుకున్నాయి టగ్గులు!

'మృగనయన' జల ప్రవేశం చేసింది.

దాన్నింక ఫిట్టింగౌట్ బెర్త్ దగ్గర కట్టేసి ఆ పైన గదులు, క్రేన్‌లు వగయిరా అంతా బిగించడం మొదలెడతారు. ఆరేడు నెలల తర్వాత కంపెనీ వారికి దాని నప్పగిస్తారు. అక్కడ నుంచి దాని సాగర జీవితం ఆరంభం!

కరచాలనాలు, పలకరింపులూ అయ్యాక శశిధరూ నేను బయటికి నడుస్తున్నాము.

"ఆ 'సూర్యతేజ' షిప్ మీద కెళ్దాం వస్తారా"

ఉత్సాహంతో తలవూపాను.

'గేంగ్ వే' మీదుగా నడిచి ఓడ ఉపరి తలం-దాన్ని డెక్ అంటారు, అక్కడికి చేరాము. అక్కడ ఇనుప పలకలు, దూలాలు, వార్నిష్ డబ్బాలు, వెల్డింగ్ సెట్లు, అల్లిబిల్లిగా వైర్లు, పనిముట్లు పడివున్నాయి. వందలాది కార్మికులు, ఇంజనీర్లు ఎవరిలోకం వారిదిగా పనులు చేస్తున్నారు. మరి ఓడ నిర్మాణం అంటే సముద్రం మీద తేలేటట్లు ఏడంతస్తుల మేడను కట్టడం - అన్నమాట! పై పెచ్చు ఆ ఇల్లు గంటకు ఏ పదిమైళ్ళ వేగంతోనో సముద్రాలు దాటాలి. ఈ ఓడయితే ఇరవై వేల టన్నుల సరుకుల్ని మోయాలి కూడా. కనుక దానివెనుక ఎంత ఆలోచన, ఎంత శ్రమ, ఎంత టెక్నాలజీ, ఎంత చెమటఖర్చు అవుతూందో....

జాగ్రత్తగా వైర్లుదాటుకుంటూ మూతలు లేని అగాధాలను చూసుకుంటూ, బ్రహ్మాండమైన కాకర పువ్వొత్తుల్లాటి వెల్డింగ్ వెలుతురు నుండి చూపును మళ్ళిస్తూ ఆశ్చర్య పోతూ, ఆడుతూ, చూస్తూ, ఆలోచిస్తూ నడుస్తున్న నేను హఠాత్తుగా ఆగాను.

"మీట్ కేప్టెన్ చౌహాన్, మాస్టర్ ఆఫ్ ది వెసెల్! దిస్ ఈజ్ ప్రొఫెసర్ రావ్ ఆఫ్ ఆంధ్రా యూనివర్సిటీ!" అని పరిచయం చేశాడు శశిధర్.

గ్రీకు శిల్పంలా వున్నాడతడు. లేత గోధుమరంగు కళ్ళు! కాని వాటి వెనుక, మబ్బులా అవి.....?

చౌహాన్ తన కేబిన్‌లోకి తీసుకెళ్ళాడు. కూచున్నాం.

"డ్రింక్స్"

"ఓన్లీ సాఫ్ట్, ప్లీజ్!"

నవ్వాడు. మగవాళ్ళు అంతందంగా నవ్వడం నేను చాలా అరుదుగా చూశాను.

శశిధర్ షిఫ్ గురించి అడుగుతుంటే చౌహాన్ నిదానంగా చెబుతున్నాడు. కాసేప య్యాక మా ఇద్దరికీ కేబిన్లు, బ్రిడ్జి, డైనింగ్ హాలు, ఇంజన్ రూము, హాచెస్ అన్నీ చూపించాడు.

"ఈ షిఫ్ పూర్తిగా సిద్ధంఅయి ప్రయాణం ఎప్పుడవుతుంది కెప్టెన్?" అని అడిగాను.

"ఇంకో నాలుగయిదు వారాలు పట్టవచ్చు. అయితే దీని మొదటి ప్రయాణం తాలూకు వాణిజ్యం ఒప్పందం మాత్రం అయిపోయింది.

ఇక్కడినుండి కలకత్తా వెళ్ళి టీ, గోనెసంచులూ తీసుకొని ఒడెస్సాకు వెళ్తాము."

"అదెక్కడ అమెరికాలోనా?" అని అడిగాను.

"రష్యా" అని శశిధర్ చెప్పగానే నా భౌగోళిక అజ్ఞానానికి సిగ్గేసింది.

ఇవేమి పట్టించు కోకుండానే, చౌహాన్ ఓడ ఒడెస్సానుండి స్టేట్స్ వెళ్ళి, అక్కడ నుండి ఏయే సరుకులు తేవాలో చెప్పాడు.

మాట్లాడుకుంటూ 'గేంగ్ వే' దగ్గర కొచ్చాం.

'ఈ ఓడ మంచిదేనా?' అని స్కూలు విద్యార్థిలా అడిగాను.

చౌహాన్ ఓడ గోడను ప్రేమగా తట్టాడు. "షి ఈస్ ఎ ఫైన్ వెసల్! ఆల్ వైజాగ్ మేడ్ వెసెల్స్ ఆర్ ఫైన్!" అని విషయం తెలిసిన వాడిలా, సాధికారంగా చెబుతూంటే నా కెంతో సంతోషమన్పించింది.

"థ్యాంక్యూ!" అన్నానునేను..... మా వూరు కట్టిన ఓడ కదా మరి!

"ఒకే కెప్టెన్! కలుద్దాం మళ్ళీ" శశిధర్ చేయిజాచాడు.

కరచాలనాలు ముగిశాయి. శశిధర్ నేను ఓడ దిగాము.

గబగబ బెర్త్ చివరిదాకా వచ్చాము. ఒక్క క్షణం ఆగి వెనక్కు తిరిగి చూశాను. దూరంగా, ఎత్తుగా, ఓడ మీద అమూలాగా అతడు, ఆ కెప్టెను... అతడి వయసుకు, వృత్తికీ, హూందాకూ, జీతానికీ– అతడి మాటలలోని నిదానానికీ స్వరంలోని సంధ్యా రాగానికి పొంతనలేదా.... ఏనిజం కల్లయింది? ఏ ద్రాక్ష పులుపయింది? ఏపున్నమి చీకటయింది? ఆ ఆనందార్ణవం ఎండి పోయింది?

కారులో శశిధర్ నడిగాను.

"యు ఆర్ కరెక్ట్! చౌహాన్ చాలా తీవ్రమయిన మానసికగాయం నుండి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. మీకా కథ చెబుతాను. కాని ఇప్పుడు కాదు. నాకు

పదింటికో మీటింగుంది." అని నన్నింటి దగ్గర వదిలేసి వెళ్ళిపోయాడు శశిధర్.

మూడు రోజుల తర్వాత ప్రాతః కాలాన్నే లేచి నేనూ మా ఆవిడా యథా ప్రకారం మార్నింగ్ వాక్ నిమిత్తం బయలుదేరాం. బీచి రోడ్ మీద నడుస్తున్నాం. ఇంకా చీకటిగా వుంది. వీధి దీపాలు వెలవెలాపోతున్నాయి. సముద్రపు అలల హోరు ఉప్పు నిండిన బరువైన తేమగాలి, చిరుచలిగావున్నా వాతావరణం – ఈ భూప్రపంచం మీ్మద మొట్టమొదటి ప్రాణి అనేది పుట్టినప్పుడు – ఇలాగే వుండేదేమోనన్పిస్తాంది.

మాట్లాడితే పగిలి ముక్కలయి చెల్లాచెదరై పోతుందేమోనన్న ప్రశాంతి నలాగే సంపూర్ణంగా అనందిస్తూ మౌనంగా నడుస్తున్నాం. ఇద్దరమూ.

ఒక చోట ఆగి, సముద్రతీరం దగ్గరగా నిల్చున్నాము. తూర్పు ఆకాశం, వెలుతురును కనడానికి నొప్పులు పడుతోంది. ఆ నొప్పి నుదుట గీచిన గీతల్లా అక్కడక్కడ తెల్లవారలు కన్పిస్తున్నాయి. ఆకాశం సముద్రం రెండూ కలసి పోయినట్టూ, కాదుకాదు వేరుగా వున్నట్టూ, కాదు అదీ ఇదీ కూడా అయినట్టు అయోమయముగావున్న అదూరపు అంచుకేసి చూస్తూ నిలబడ్డాం. ఆ వెనుక ఎక్కడో పాండురంగస్వామి కోవెలలో కాబోలు ఎవరో గంట మోగిస్తున్నారు.... నిద్రలేని దేవుడికి మేలు కొలుపు! పొలంలోని రైతుకు కష్టించడం గురించి మంత్రిగారు సెలవిచ్చినట్లు–

మా దగ్గరగా నురగలనవ్వులతో అలల కేరింతలతో ఆడుకుంటూంది సముద్రం. ఆ దూరంగా, కోట్లాది అలల శిశువులను మోస్తున్న చూలాలిలా, ఎత్తైన గర్భంతో అదే సముద్రం. దానిమీద అక్కడొకటీ అక్కడొకటీ చెమట బిందువుల్లా మసక మసకగా పడవలూ ట్రాలర్లూ కనపడసాగాయి.

ఎడమవైపు పాతలైట్ హవుస్ నోరు లేని పక్షిలా నిలబడివుంది. అక్కడ ఇసుక తిన్నెల మధ్య కాస్త ఎత్తుగా వున్న రాయి మీద యోగిలా చూస్తున్నాడతడు ఏదయినా ధ్యానంలో వున్నాడోమో....

ఇంక వెడదామా అన్నట్లు చూసింది శ్రీమతి.

తిరిగి పది గజాలు నడిచాము. ఆ రాళ్ళ గుట్ట దగ్గరయింది.

ఆ రాతి మీద యోగి – చౌహాన్:

మనిషి ఇసుక మీద, మనసు నీటిమీదనా:

అతడిని పలకరిద్దామని నోరు తెరవబోయి ఆగిపోయాను. అవాతావరణం లో ఆ ఉషః కాలంలో ఏ వ్యక్తికావ్యక్తి కోరి కోరి ఏకాంతకుహరంలోకి వెళ్ళి, ఆది శిశువై సృష్టి గర్భంలోకి ముడుచుకు పోదామని ప్రయత్నం చేసే వేళ – మనిషిమాట silly irrelevance అన్పించింది.

ఇంటికెళ్ళాము. వేడి వేడి ఇడ్లీలను తయారుచేసిన ఇల్లాలికి చౌహాను ఎలా కలిశానో చెప్పాను. అతడిలోని నేనింతదాకా తెలుసుకొన్న విషాదచ్ఛాయల గురించి చెప్పాను.

ఒడల మీద ఊరూరా తిరిగేవాడికి ఒక ఆశయమేమిటి ఆవేదనేమిటి? ఏ సిడ్నీ నైట్ క్లబ్ డాన్సర్ గురించో బెంగపెట్టుకుని వుంటాడు. కుర్రవాడన్నారు కదా.....అని

నా సిద్ధాంతమంతా చిమ్మి పారేసింది.

అమరురోజు సాయంకాలం నేను శశిధర్ టెన్నిస్ గేమ్ అయ్యాక కూర్చున్నాం. క్లబ్‌లో ఇద్దరమే వున్నాము. అప్పుడు చెప్పాడు శశిధర్.

* * *

ముప్ఫై యేళ్ళకే షిప్ మాస్టరవగలిగాడు చౌహాన్. కాంటినెంటల్ కేరియర్స్ వారి మెరైన్స్ సిబ్బందిలో అంతటి నిపుణుడు లేదన్న పేరు తెచ్చుకున్నాడు. అయిల్ టాంకర్లు, ఖనిజాల ఓడలు, ఇతర సరుకుల ఓడలు, ఏవయినా సరే చౌహాన్ అవలీలగా అన్ని సముద్రాలనూ దాటించేవాడు. ఇంగ్లండు, అమెరికా, నెదర్లండ్స్, జపాన్ ఎక్కడకయినా సరే నౌకను సురక్షితంగా చేర్చేవాడు. అతడి సిబ్బంది అతడి కలుపుకోరుతనానికి ఆకర్షితులై ఇబ్బడిగా పనిచేసే వారు.

మాస్టరయిన ఏడాదికి చౌహాన్ జస్వంత్‌ను పెళ్ళి చేసుకున్నాడు.

అందానికి అందం జతయితే, ఐశ్వర్యం, పదవి, అవకాశం కూడా సమకూరితే, ఆనందం సంగీతానికి శరీరంలోని అణువణువూ వీణగామోగే వయసులో – భావి దివి కాదా! మనిషి గంధర్వుడవడా! బతుకొక పున్నమికాదా! ఆనందం అర్ణవం అవదా!

అదే అయింది చౌహాన్ జస్వంత్‌ల విషయంలో. టోక్యో గింజాలో ఎంజాయ్ చేశారు. ఐఫెల్ టవరెక్కి ప్రపంచాన్ని పాదాలకింద చూశారు. వెనిస్‌లో గండోలా మీదా ఇటాలియ్ ఎండల వెచ్చదనం అనుభవించారు.

లండన్ సోహోలో సొక్కారు ఆగ్రాలో తాజ్ ఎదుట సోలారు.

....అయిదు నెలలూ అయిదు క్షణాలయ్యాక చౌహాన్ మళ్ళీ డ్యూటీలోకి చేరాడు. అతడితోపాటు అర్ధాంగీ ఓడ నెక్కింది.

ఓడ 'క్రూ' అంతా బారులు తీరిచి చేతులతో తోరణాలు కట్టి ఏవో ఇంగ్లీషునీ, హిందీనీ కలిపి పాటలు పాడుతూ స్వాగతం చెబుతుంటే చౌహాన్ సగర్వంగా ఆమెకేసి చూశాడు. ఆ అందాలభరిణె సిగ్గుతో ముడుచుకొంది.

ఓడమీద ఫస్టింజనీర్ అశుతోష్ రాయ్ భార్య పారో; జస్వంత్ పాపిట్లో సింధూరం దిద్దింది. ఓడమీద జీవించాల్సిన తమలాటి ఆడవారు ఎలా వుండాలో, ఆ జీవితంలోని మంచి చెడ్డలేవిటో వివరించింది.

కొద్ది రోజులలోనే జస్వంత్ ఆ జీవితాని కలవాటుపడింది.

పారో మాత్రం "తమ్ముడూ! షిప్ కన్నా 'షి' ముఖ్యం" అని చౌహాన్‌ను ఆట పట్టించేది. "మరి కొంచెం రూష్‌రాస్తే తల్లీ, ఆ బుగ్గమీద నక్షత్రాలు కన్పించవు." అంటూ జస్వంత్‌ను కవ్వించేది. ఒక్కోసారి నలుగురూ కలిసి భోజనం చేశేవారు. లేకపోతే అందరితోపాటు డైనింగ్ హాల్లో చేసేవారు. ఒక్కోసారి జస్వంత్ కిచెన్‌నుంచి వండినదంతా తమ కేబిన్‌లోకే తెప్పించేది. ఇద్దరూ కలిసి ఆడుతూ పాడుతూ భోజనం ముగించేవారు.

"మాస్టరాణి వచ్చాక మాస్టరుగారి ఎఫిషియెన్సీ పెరిగిందోచ్–" అని కన్నుకొట్టాడు

ఒక మేరిట్.

"షటప్ యువర్ డ్రెయిన్ మౌత్!" అని కసిరాడు అతడి సహచరుడు.

ఒకసారి, ఓడ లిస్బన్ నుంచి కేప్‌వైపు వెళ్తోంది. డెక్‌మీద పక్కపక్కగా వాలు కుర్చీలలో కూర్చుని వున్నారు చౌహాన్ జస్వంత్‌లు. అట్లాంటిక్ మహాసముద్రం మీద ఓడ నెమ్మదిగా పయనిస్తోంది.

"జెస్సీ!" అని గోముగా పిలచాడతడు.

"ఊ!" అంది ఏదో ఊర్ధ్వ లోకాల నుండి దిగివస్తూ ఆమె.

"ఇన్నేళ్ళు మనం కలుసుకోకుండా ఎలా వున్నాము?"

ఆమె ఇంకా వెనక్కువాలి నవ్వింది. విరబోసిన ఆమె కురులు కెరటాలు, గలగలమన్న ఆమె నవ్వే అలలవెండి అంచులు.

అతడి చేతిని తన చేతిలోనికి తీసుకుని నెమ్మదిగా రాస్తూ– "దీనా! మనకు తెలియకుండానే ఒకరికోసం ఒకరు ఎదురుతెన్నులు చూశాం....కలలు కన్నాం..." అంది.

"నీకల నిజమయిందా?" అన్నాడు.

"ఓ!" అందామె అతడి చేతిని పెదాల కానిస్తూ.

"నాకు నిజం కాలేదు." అన్నాడతడు – ఫిర్యాదు చేస్తున్నట్లుగా. ప్రశ్నార్థకంగా చూశాయి ఆమె కళ్ళు.

"నా కొచ్చిన ఏ కలాకూడా – ఇంత సౌందర్యం నాదవుతోందని, ఇంతదృష్టం నెమ్మదిగా నడిచి వచ్చి నాజీవితంలో ముడిపడుతుందని నాకుచెప్పలేదు" అన్నాడు. నిష్ఠూరంగా మరుక్షణం నవ్వింది జస్వంత్. అట్లాంటిక్ మీద వెన్నెల కురిసింది.

అట్లాగే మాట్లాడుతూ నిద్రలోకి జారిపోయారు. అర్ధరాత్రప్పుడు అతడు చట్టుక్కున లేచి చూశాడు. వెన్నెలలో తన మిసస్ నిద్రపోతోంది. ఒక స్టూలు తెచ్చి ఆమె పాదాలను అతి నెమ్మదిగా వాటిమీద అమర్చాడు. రగ్గుతెచ్చి ఆమెకు కప్పాడు ముంగురులు సర్దాడు నుదుట ముద్దు పెట్టుకుని రౌండ్స్‌కి వెళ్ళాడు.

అరగంట తర్వాత అతనటు వచ్చేసరికి ఆమె "దీనా దీనా!" అని పిలుస్తోంది. పరుగెత్తి కెళ్ళాడు.

"ఏమయింది జెస్సీ...."

"ఏదో కల వచ్చింది దీనా! నేను ఓడనట, నేనేమో వెళ్ళిపోతుంటే నువ్వేమో ఒడ్డులాగా అక్కడే వుండిపోయావుట... గభుక్కున్న మెలకువ వచ్చి చూస్తే నువ్వు లేవు. కాని నువ్వు కప్పి వెళ్ళిన రగ్గుంది. అందుకని లేచి నిన్ను పిలవసాగాను. ఇంకాస్త వుండి కేబిన్‌లోకి వెళ్దాం అనుకుంటుండగా నువ్వేవచ్చావు. బంగారు కొండవి– " అని రెండు చేతులను మాలగా చేసి అతడికి వేసింది.

"పిచ్చిదానా! ఓడకు పుట్టిల్లు ఒడ్డే! అత్తారిల్లు సముద్రం. ఓడకు ఒడ్డు, నీరుకూడా అవసరమే. ఏఓడా ఎప్పుడూ నీటిలోనే వుండిపోదు. నువ్వు ఓడవు, నేను ఒడ్డుని

అయితే మన అనుబంధం సముద్రం" అని ఆమెను గాఢంగా హత్తుకుని తమ కేబిన్‌లోకి నడిపించి తీసుకు వెళ్ళాడు.

—ఆ మరు వాయేజ్ బొంబాయినుండి లండన్ కుంది. జస్వంత్ నాన్నకు ఒంట్లో చాలా బాగాలేదని కేబిల్ వచ్చినందున ఆమెను పంజాబులో పుట్టింట విడిచివచ్చాడు చౌహాన్. విడవలేక విడిపోయారు. దారిలో ఏ రేవులో దిగినా ఫోన్ చేసేవాడు చౌహాన్.

జస్వంత్ తండ్రికి ఢిల్లీ ఆలిండియా మెడికల్ సంస్థలో ఆపరేషనయ్యాక పూర్తిగా స్వస్థత చేకూరింది. ఆ మరుసటి వారం పంజాబు రాగానే – చౌహాన్ ఫోన్ కాల్ వచ్చినప్పుడీమాట చెప్పి, తానింక వుండనని చెప్పింది జస్వంత్. మరు బుధవారం బొంబాయినుంచి లండన్‌కు ఎయిరిండియా ఫ్లైటు మీద రావలసిందనీ, తాను హీత్రో విమానాశ్రయంలో ఎదురుచూస్తుంటాననీ చెప్పాడతడు. ఆమె మనసు ఆరు రోజుల తర్వాత ఆక్షణంలోకి వెళ్ళిపోయింది. "దీనా! నీకింకో మంచికబురుంది–"

"ఏమిటది?"

"ఇప్పుడు చెప్పను–"

"ఒకే! టెల్ అన్ వెన్స్‌డే!..."

లండన్ విమానాశ్రయంలో విమానం దిగుతున్న ఆవిడను పరుగెత్తుకెళ్ళి పొదువుకున్నాడు చౌహాన్.

టాక్సీలో వెళ్తుండగా అడిగాడు చౌహాన్ "మంచి కబురన్నావు?"

కళ్ళతో చెప్పిందిప్పుడుకాదని.

హోటల్‌లో ఏకాంతంలో చెప్పింది. తమ ఏకాంతం ఇంకెంత కాలమో వుండదని.

నిలువెల్లా ముద్దులతో ముంచెత్తాడామెను ఆమె బొడ్డు దగ్గర చెవిపెట్టి విని తలపైకెత్తి– "హోహో!" అన్నాడు.

ఏమిటది అని అడిగిందామె చూపు.

"డాడీ! డాడీ!" అని పిలుస్తుంది బేటీ!

పెదవి వంకరగా తిప్పి అతడి జుత్తులోకి చేయి పోనిచ్చి, ఇంకో చేత్తో నోరు మూసింది జస్వంత.

రెండు రోజుల తర్వాత వారి షిప్, ఫిలడెల్ఫియా వెళ్ళి అక్కడనుండి విశాఖపట్నం వచ్చింది. వారం రోజుల తర్వాత జపానుకు బయలుదేరింది. అక్కడ సరుకులు దించాక వేరే 'కార్గో' తో సింగపూర్‌కు బయలుదేరింది.

అది సెప్టెంబరు రెండవ వారం.

అరవై గంటల ప్రయాణం తర్వాత ఓడ చైనా సముద్రంలోకి వచ్చింది.

సముద్రంలో ఆటుపోట్లు కొంత ఎక్కువగా వున్నాయి.

"నువ్వు కేబిన్ నుండి బయటకు రాకు–" అని జస్వంత్‌ను కట్టడి చేశాడు చౌహాన్.

కాని ఆమె కనపడకుండా తనో అరగంటయినా ఉండలేనని తెలుసుకున్నాడు.

మధ్యాహ్నం రాయ్ దంపతులతో కలిసి భోజనం చేశారు.

"నువ్విలా నంజితే లాభంలేదు. ఇద్దరి తిండి తినాలి. ఏం తమ్ముడూ మీ అబ్బాయి పది పౌన్లన్నా ఉండొద్దూ" అంది పారో

"అబ్బాయి కాదుట.... అమ్మాయేనంటోంది'" అన్నాడు కెప్టెన్ భార్యవంక కొంటెగా చూస్తూ.

"ఛీ.... పొండి నేనేమి అనలేదు" అంది జస్వంత్ తలవంచుకుని.

"ఇదుగో పారో....అమ్మాయినలా పూరికే ఉడికించకు...." అని మందలించాడు రాయ్.

"అబ్బబ్బ! డైనింగ్ టేబుల్ దగ్గర కూడా నవ్వుకో కూడదేమిటి-" అని గునిసింది పారో.

"నవ్వొచ్చు బేబీ! నవ్వొచ్చు-" అని బేబీ! శబ్దాన్ని ఒత్తిపలికాడు రాయ్. అందరు గొల్లున నవ్వారు.

ఈలోగా రేడియో ఆఫీసర్ వచ్చాడు..."ఎక్స్‌క్యూజ్ మి సర్!"

"ఎస్. నటరాజన్!" అన్నాడు చౌహాన్ టేబిల్‌నుంచి లేచి. "తీవ్రమైన వాయుగుండం ఒకటి ఏర్పడుతోంది. తుఫాను వచ్చే సూచనలున్నాయి సర్!"

"షిప్ పొజిషన్ ఏమిటి?"

"121°-40 తూర్పు - బై - 30°-16 ఉత్తరం సర్--"

"డిప్రెషన్ ఎక్కడ-"

చెప్పాడు రేడియో ఆఫీసర్ నటరాజన్.

"ఒ.కె.... ఓ నిముషంలో బ్రిడ్జిమీద కొస్తున్నాను. రాయ్--"

"ఎస్ సర్!" అని నిల్చున్నాడు అంత వరకు మిత్రుడిగావున్న రాయ్.

బ్రిడ్జిమీద నుంచి బైనాకులర్స్‌తో చూశాడు. అలలు ఎత్తుగా లేస్తున్నాయి... కాని ఆకాశంమీద అసాధారణమైన సూచనలేవీ లేవు. తుఫాను వాయవ్యంగా తమ వైపు వస్తూంది. గంటకు ఎనభై కిలోమీటర్ల వేగంతో వస్తూంది. సుమారు మూడువందల నాటికల్ మైళ్ళవతల వుందీ క్షణాన అంటే రఫ్‌గా మూడుగంటలలో అది తన షిప్‌ను ఢీకొనవచ్చు. వాచి చూశాడు. రెండు నలభై అయింది. నాటికల్ మ్యాప్ చూశాడు. లేకపోతే షాంఘై సమీపాన చైనాతీరాన్ని తాకవచ్చు-- ఎనీవే--

"రాయ్ ఇంజన్స్ ఎలావున్నాయి--"

"చాలా దిట్టంగా వున్నాయి సర్--"

నవ్వాడు చౌహాన్, ఛీఫ్ ఆఫీసర్ కరంచందానీ వైపు తిరిగాడు. "వేర్ ఆర్ ది మెన్?"

"ఇన్ పొజిషన్ సర్--"

"గుడ్? కీప్ దెమ్ అండర్ అలర్ట్ - గాభరా పడక్కర్లేదని చెప్పండి నటరాజన్!" పావుగంటకొకసారి మెట్ రిపోర్టివ్వండి నాకు - రాయ్! హేవ్ ఎ లుక్ ఎట్ ది హోర్ట్ సిస్టమ్స్.. కింద బాయ్‌ని అలర్ట్ చెయ్యండి.... కరంచందానీ యు విల్ బి అన్ ది బ్రిడ్జ్... ఐయామ్ గోయింగ్ రవుండ్! విల్‌బి బేక్ ఇన్ టెన్‌మినిట్స్."

చకచక షిప్పంతా చుట్టి వచ్చాడు చౌహాన్. సిబ్బంది అందరినీ భుజం తట్టి వచ్చాడు.

బ్రిడ్జిమీద కొచ్చాడు.

పరిస్థితిలో మార్పులేదన్నాడు. కరం చందానీ వందమైళ్ళ పరిధిలో చుట్టుపక్కల ఏయే ఓడలున్నాయో కనుక్కోమని నటరాజన్‌కు ఆదేశించాడు. షిప్‌ను దక్షిణ దిశగా ఆగ్నేయంగా మళ్ళించాడు. ఆ విధంగానయితే తుఫాను తమకు పడమరగా వుండిపోతుంది.

కేబిన్ కొచ్చాడు. జస్వంత్‌తో బాటు పారోకూడా వుంది. వాళ్ళిద్దరి కళ్ళల్లోని ఆందోళన గమనించి.... "నథింగ్ టు వరీ" అన్నాడు. కుర్చీలో జేరగిల బడ్డాడు.

పారో లేచి వెళ్ళింది.

జస్వంత్ అతని పక్కనొచ్చి కూర్చుంది. "నువ్వుండగా నాకేమి దిగుల్లేదు దీనా! నాతో పాటు మరి నలభైమంది ప్రాణాలు నీ రక్షణలో వున్నాయి! అరవై డబ్భై కోట్ల ప్రాపర్టీ వుంది నీచేతుల్లో వాటినిగురించి ఆలోచించు....డోన్టు బాదర్ అబౌట్ మి ఎటాల్!"

"మై బ్రేవ్‌గర్ల్! కెప్టెన్ భార్యవనిపించుకున్నావు" అని ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

ఫ్లాస్క్‌లోంచి 'టీ' పోసుకొని తాగారిద్దరూ.

"టేక్ రెస్ట్!" అని చెప్పి బయటికి వెళ్ళాడు.

-- ఐదయింది. ఆకాశం దట్టంగా మబ్బులతో నిండి పోయింది. గాలి అతి చల్లగా వేగంగా వీస్తూంది.

ఆకాశానికి అద్దం పట్టినట్టు సముద్రం ముదురాకు పచ్చనుండి ఇంచుమించు నలుపురంగుకు మారింది. సముద్రగర్భంలో ఏదో కుతకుత ఉడుకుతున్నట్లు ఎగసెగసి పడుతూంది. ఆమాత్రం 'స్వెల్' సెప్టెంబర్‌లో చైనా సీలో సహజమే... ఇది తుఫాను వల్లకాదు. తన ఓడ దిశమార్చి రెండున్నర గంటలయింది.

యాభై మైళ్ళకయినా తుఫాను అంచుకు తూర్పున వుండాలితాము. అనుకుంటు న్నాడు డెక్‌మీద రెయిలింగ్ పట్టుకుని నిలబడిన చౌహాన్.

"దీనా! ఒంటరిగా ఇక్కడ ఏం చేస్తున్నావు" ఉలిక్కిపడి తిరిగిచూశాడు.

ఇటూ అటూ ఊగుతున్న ఓడ డెక్‌మీద సిద్ధ 'పాదు' రాలయిన బేలెరినా లాగున అతడిని సమీపించింది జస్వంత్.

"జేస్సీ! ఈవెదర్‌లో ఓపెన్ డెక్ మీద కెందుకొచ్చావు--"

"నిన్నుచూసి గంటయింది. దీనా!"

అతడి మనసు ఎన్నెన్నో చెప్పాలని తహతహలాడింది. తన పక్కనే రెయిలింగ్ పట్టుకుని ఆమెచేతి మీద తన చేతి నుంచాడు. మళ్ళీ జస్వంతే పలికింది.

"ఈ క్షణాన నీ మెదడు ఎన్ని సమస్యలతో ఉడుకుతోందో...నేను నీకు ఏవిధంగానూ సాయంచేయలేను కదా--"

ఆమె నడుము చుట్టు చేయివేసి దగ్గరకు లాక్కున్నాడు.

"నువ్వు నాతోబాటు వున్నావన్న ఫీలింగ్ చాలు జేస్సీ--" అన్నాడు ఆర్ద్రంగా.

"దీనా! నా దీనా!" ఇద్దరూ ఒక్కరై సముద్రం వైపు చూశారు సముద్రపు హోరు ఒక్కనిమిషం ఆగింది. ఉన్నట్లుండి.

ఫైర్ అలారం మోగింది.

మరుక్షణం పరుగెత్తుకుంటూ వచ్చాడతడు. పెట్టీ ఆఫీసర్ - "సర్, ఫైర్ ఇన్ ఇంజన్ రూం!"

విచలితుడయ్యాడు చౌహాన్.

అరక్షణం తర్వాత--

హఠాత్తుగా ప్రకృతి ఒళ్ళు విరుచుకుంది. సముద్రం ఆవలించింది. యాభై అడుగుల ఎత్తు అల ఒకటి పెనుభూతమై లేచి పెద్ద పిడుగు పడ్డట్టు పడింది. కుంభీ పాతమై వర్షించింది. ఆతాకిడి తిన్న షిప్ పోర్ట్ సైడుకు బాగా వాలింది.

"స్టార్ బోర్డు సైడ్.... జస్వంత్..రాయ్... ఫైరాఫ్....జేస్సి రెయిలింగోడలకు.. ఆఫీసర్..." అని ఎన్నెన్నో ఆదేశాలిచ్చాననుకున్నాడు చౌహాన్ కాని .... నోరు మూత విడలేదు. కళ్ళు మూతలు పడలేదు.

ఏనుగు తొండాలవంటి ఆధారలు విరిగిన చెట్ల కొమ్మల్లా వర్షిస్తుంటే ఆ తాకిడికి వాళ్ళున్న పోర్టుసైడు రెయిలింగ్ సముద్రం అంచును తాకింది. లైఫ్ బోటొకటి తెగి సముద్రంలో పడిపోయింది.

నిముషం తర్వాత నీటి చీకటి పోయిం తర్వాత కళ్ళు తెరిచి చూడడానికి వీలయిన తర్వాత-

ఓడ ఆ భయంకరమైన అలను దాటి ఇవతలకి వచ్చాక రెయిలింగ్‌ని రెండు చేతులతోనూ పట్టుకుని వేలాడుతున్న చౌహాన్ తన పక్కగా చూశాడు జేస్సి లేదు.

డెక్‌మీద విరిగిపడివున్న మాస్ట్ పక్కగా నుదుటి మీద నెత్తురులో పెట్టీ ఆఫీసరు పడి ఉన్నాడు.

"జేస్సీ!" చౌహాన్ వికృతంగా జీరగా, ఏడుపుగా అరిచాడు.

సముద్రం ప్రతిధ్వనించింది.

* * *

"ఆ తర్వాత రావుగారూ! చౌహాన్ వెర్రివాడిలా అంత తుఫానులోనూ,

సుమారు ఒక రోజు రోజంతా షిప్ నక్కడే తిప్పుతూ కనీసం జెస్సీ దేహమయినా దొరుకుతుందేమోనని వెతికి వెతికి పడిపోయాడు.

– షిప్ సింగపూర్ చేరింది చౌహాన్ డెక్ మీదనుంచి కదలలేదు. రాయ్ అతడికి సెడేషన్ ఇప్పించి బలవంతంగా బాంబేకు తీసుకొచ్చాడు.

"వారం తర్వాత చౌహాన్ తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాడు. కాని వాళ్ళ కంపెనీ వారు ఒప్పుకోలేదు. ఎన్ని నెలలయినా సరే ఎన్ని ఏళ్ళయినా సరే మీకెప్పుడు డ్యూటీలో వుండాలనిపిస్తే అపుడు జాయిన్ అవండి. అందాక మీరు సెలవులో వున్నట్లుగా భావించి పూర్తి జీతం ఇస్తాం!" అన్నారు సుమారు ఏడాదిపాటు ఒక వూరనక ఒక దేశమనక తిరిగి తిరిగి తిరిగి– ఆఖరికి బొంబాయిలో కంపెనీకి రిపోర్ట్ అయ్యాడు చౌహాన్. వాళ్లు విశాఖ షిప్ యార్డులో కడుతున్న తమ కొత్త నౌక 'సూర్య తేజ'కు మాస్టర్‌గా అతడిని పంపారు. అతడు మూడు నెలల కింద ఈ వూరు వచ్చాడు. వచ్చిన వారానికల్లా నాకు వాల్తేరు క్లబ్‌లో పరిచయం అయ్యాడు. మొదట ముక్తసరిగా వున్నా క్రమక్రమంగా బాగా స్నేహమయ్యాడు. కొద్దికొద్దిగా తన జీవితంలో ఆ పున్నమి గురించి, ఆ అమావాస్య గురించి చెప్పాడు.

...అందుకే ఆ రోజు సాయంకాలం క్లబ్‌లో మీతో అన్నాను–

"అనుబంధం ఎంత లోతయితే గాయం అంత లోతని! గుర్తుందా?" అని ముగించాడు శశిధర్.

"టెన్నయింది సార్!" అన్నాడు క్లబ్ బాయ్.

ఇద్దరమూ లేచాము.

* * *

అదుగో 'సూర్యతేజ' దిఙ్మండలంలో ఒక చుక్కలాగా అవుతూంది. ఆ చుక్క మీద ఒక చిన్న చుక్క మాస్టర్ చౌహాన్. ఆ అణోరణీయాన్ మనసులో పసిఫిక్ మహాసముద్రమంత గాయం. సముద్రం మీద ఓడ. ఓడమీద మనిషి. మనసులో మహా సముద్రం.

సూర్యుడు వేసిన రంగుల గారడీల వలను దాటి సముద్రం చిరుచీకటి గుహలో తాబేలయింది.

విశాలంగా, నల్లగా నాపాదాల కింద సముద్రం హోరుమంటోంది.

నా వెనుక గుడిగంట మోగింది.

'డాల్ఫిన్స్ నోస్' కొండంచున లైట్ హవుస్ నిర్విరామంగా తిరుగుతూంది, చీకటి వెలుగుల గీతలు గీస్తూ–

నాముందు లక్ష విద్యుద్దీపాలతో – ఎవరో దేవతలు పారేసుకున్న వజ్రాల హారంలా మెరుస్తూంది విశాఖపట్నం.

('ప్రభవ' సంక్రాంతి '80')